మోండా సమగ్రాభివృద్ధికి కృషి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 23: ఎంతో చరిత్ర కలిగిన మోండా మార్కెట్ సమగ్ర అభివృద్ధికి త్వరలో ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి మోండా మార్కెట్‌లో పర్యటించారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి. సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని పలువురు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. చెత్త డంపింగ్ యార్డులోని వ్యర్థాలతో ఇబ్బందులున్నాయని పలువురు వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యార్డు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని, మిగతా సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు వందేండ్ల చరిత్ర కలిగిన మోండా మార్కెట్‌పై ఆధారపడి వేలాది మంది జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని వ్యాపారాలతో ఎంతో గుర్తింపు పొందిందన్నారు. మోండా మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రణాళికలను రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఇటీవల మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరిగి నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎమ్మెల్యే తలసాని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించి ప్రాంతాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ముగ్గురు బాధితులకు తన వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున సాయం అందించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్ట పరిహారం వీలైనంత త్వరగా మంజూరు అయ్యే విధంగా చూడాలని తహసీల్దార్ పాండునాయక్‌కు సూచించారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా మార్కెట్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని వాటిని పోలీసుస్టేషన్‌కు అనుసంధానిస్తే నేరాలను నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ సుదర్శన్, శానిటేషన్ డీఈ దేవేందర్‌రెడ్డి, మార్కెట్ పీఎస్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఏఈ అనుష, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు రాములు, మహేందర్, మహేశ్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేషన్ రాజు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్‌లో ఆయా విభాగాల అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అగ్ని ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అయ్యప్ప పూజకు ఆహ్వానం


సికింద్రాబాద్ ఎమ్మెల్యేతో సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్

సికింద్రాబాద్, డిసెంబర్ 23: మెట్టుగూడలోని చరిత్రాత్మకమైన అయ్యప్ప స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించే మండల పూజ, శోభాయాత్ర ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు జరపాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ సునీత, ఆలయ కమిటీ ప్రతినిధులతో సోమవారం సికింద్రాబాద్ టకారా బస్తీలోని ఎమ్మెల్యే తన నివాసంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించారు. అదే విధంగా జీహెచ్ఎంసీ వంటి అన్ని విభాగాల స్థానిక అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించాలని కార్పొరేటర్ సునీతకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, డిసెంబర్ 23: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బీబీడి, రాంనగర్, నల్లకుంట, విద్యానగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా మంగళవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకుబీబీడీ, రాంనగర్ ఫీడర్ల పరిధిలోని బర్కత్‌పుర బస్సుడిపో, రత్నానగర్, బీజీపీ ఆఫీసు, కాచిగూడ జూనియర్ కాలేజ్, రాంనగర్, టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్ మిల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు ల్లకుంట ఫీడర్ పరిధిలోని నల్లకుంట, విజయా బ్యాంక్, భారతీ ఇనిస్టూట్యుట్, తిలక్‌నగర్ రోడ్, పీవర్ ఆసుత్రి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, అడిక్‌మెట్, అచ్యుతా రెడ్డి మార్ట్ బ్లడ్‌బ్యాంక్, వడ్డెరబస్తీ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన పీవీ

పీవీ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 23: దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చిన గొప్ప నాయకుడు పీవీ నర్సింహారావు అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా సోమవారం పీవీ ఘాట్‌ను సందర్శించి ఆయన సమాధి వద్ద పూలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఏకైక తెలుగు వ్యక్తి పీవీ అన్నారు. తన పాలన తీరుతో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకువచ్చి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పీవీ గొప్పదనాన్ని గుర్తించిందని పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్‌గా నామకరణం చేయడంతో పాటు ఇదే మార్గంలో పీవీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన మంత్రులు..

నెక్లెస్ రోడ్డులోని పీవీ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద సోమవారం తెలంగాణ రాష్ట్ర మంత్రులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, మాజీ ఎంపీ కేశవరావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, డిప్యూటీ మేయర్ శ్రీలత పీవీ సమాధి వద్ద నివాళులర్పించారు.

దివంగత ప్రధాని పీవీకి నివాళి

చిక్కడపల్లి: దివంగత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు 20 వ వర్ధంతి సందర్భంగా న్యాయవాది, తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ సభ్యుడు పులిగారి గోవర్ధన్ రెడ్డి సోమవారం నెక్లెస్ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేసిన మహనీయుడు పీవీ అని అన్నారు.

సమ సమాజ మార్గ నిర్దేశకుడు పీవీ

సమ సమాజ మార్గ నిర్దేశకుడు దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు అని టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ తనుగుల జితేందర్‌రావు అన్నారు. పీవీ ఘాట్‌లోని పీవీ విగ్రహం వద్ద ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్మిక సంఘాలకు స్థానం కల్పించాలి

ధర్నాలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, నాయకులు

చిక్కడపల్లి, డిసెంబర్ 23: కనీస వేతన సలహా మండలిలో రాష్ట్రంలో అన్ని కార్మిక సంఘాలకు స్థానం కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జి. రాంబాబు, ఉపాధ్యక్షుడు మారయ్య, టీయూసీఐ సూర్యం, సీఐటీయూ నాయకులు భూపాల్, ఐఎఫ్‌టీయూ నాయకులు శివాబాబు, ఎస్ఎల్ పద్మ మాట్లాడారు. రాష్ట్రంలోని కోటి మందికి పైగా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యలపై పోరాటాలకు న్యాయకత్వం వహిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం రెండు పాలక పార్టీకి చెందిన సంఘాలకే ప్రాతినిధ్యం కల్పించడం పట్ల మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సభ్యులుగా ఉన్న సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా జీఓ నంబర్ -21ను విడుదల చేశారని, తక్షణమే ఆ జీవోను సవరణ చేసి అన్ని యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఈ.గంగాధర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం కార్యవర్గం

గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

ముషీరాబాద్, డిసెంబర్ 23: తెలంగాణ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం హైదరాబాద్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం సంఘం హైదరాబాద్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు, జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రయ్య, రాములు, సునీల్ పాల్గొని నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడుగా కొంపల్లి విజయరావు, ప్రధాన కార్యదర్శి తుమేశ్వేట రాములు, కోశాధికారి వర్కల గణేశ్, అసోసియేట్ అధ్యక్షులు పెరుమళ్లా విజయ్‌కుమార్, కృష్ణమారే, ఉపాధ్యక్షులు నైని శ్రీరాములు, మహాలక్ష్మి, పెబ్బేటి ఊషన్న, కార్యదర్శులు కాపరివేణి రాజు, స్వామి, మహబూబ్‌ఖాన్, జాఫర్ ఖాన్, శివరామ్, ప్రచార కార్యదర్శి అనిల్, సుజాత, ఈసీ మెంబర్ సలీమ్, ఓంప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రటించారు.

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను సోమవారం తన కార్యాలయంలో కంటోన్మెంట్ బోయిన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు రాగిరి టింకుగౌడ్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.
– బొల్లారం, డిసెంబర్ 23:

టీజీసీటీఏ ఎన్నికల్లో డాక్టర్ బ్రిజేశ్ ప్యానల్ ఘనవిజయం

డాక్టర్ ఇ.బ్రిజేశ్

డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23: తెలంగాణ డిగ్రీ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఎన్నికల్లో డాక్టర్ ఇ.బ్రిజేశ్ ప్యానల్ ఘన విజయం సాధించింది. ఓయూ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బ్రిజేశ్ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి విజయం సాధించారు. అధ్యక్షుడిగా డాక్టర్ బి.శ్రీనివాస్‌గౌడ్, చైర్మన్‌గా డాక్టర్ సౌందర్య జోసెఫ్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ ఎం.భవాని, అకాడమిక్ కార్యదర్శిగా డాక్టర్ గోపాల సుదర్శనం, ఆర్థిక కార్యదర్శిగా డాక్టర్ గంగాధర్, ఉపాధ్యక్షులుగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ ఆడెపు రమేశ్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ జీఎన్ జగన్, కార్యదర్శిగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ ఎస్.హరీశ్‌కుమార్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ ఎం.రామాచారి, ఓయూ కార్యదర్శిగా డాక్టర్ రాకేశ్ భవాని, కేయూ కార్యదర్శిగా డాక్టర్ సమ్మయ్య, మహాత్మాగాంధీ వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ యాదయ్య, పాలమూరు యూనివర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ పి.రాములు, శాతవాహన వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ రాజేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రిజేశ్ మాట్లాడుతూ డిగ్రీ లెక్చరర్ల సమస్యలపై పోరాడుతామన్నారు. ఉన్నత విద్యాశాఖలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా ఉన్నత విద్య అభివృద్ధి కోసం పాటుపడతామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఉదయ్‌నగర్ నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అమీర్‌పేట్, డిసెంబర్ 23: సనత్‌నగర్ బీకేగూడలోని ఉదయ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈ మేరకు కాలనీకి అధ్యక్షుడిగా పి.విష్ణువర్మ, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, పి.సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జి.శాంతిరాజు, కోశాధికారిగా టి.శ్యాంసుందర్ తమపై పోటీకి దిగిన హేమ్‌చంద్ గుప్తా ప్యానల్ ప్రతినిధులపై ఘన విజయం సాధించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించిన పూర్ణాని మల్లారెడ్డి, డి.అనంతరెడ్డి ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.విష్ణువర్మ, కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వివాదాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోతూ కాలనీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. కాలనీ నివాసితులు నూతన కార్యవర్గ ప్రతినిధులను అభినందించారు.

అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలి

ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేసిన ఓయూ ప్రొఫెసర్లు

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ ఓయూలో నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు సవీన్, కొండా నాగేశ్వర్, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రొఫెసర్ సవీన్ సౌడ తీవ్రంగా ఖండించారు. కేంద్ర మంత్రివర్గం నుంచి తక్షణమే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రొఫెసర్ సవీన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సవీన్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల జీవితాలను మార్చిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. తాము బాబాసాహెబ్‌ను తలుచుకుంటే అమిత్‌షాకు భయమెందుకని ప్రశ్నించారు. షా వ్యాఖ్యలను ఆర్ఎస్ఎస్ కుట్రలో భాగమేనని అభిప్రాయపడ్డారు. నేడు భారత సమాజం మొత్తం బీఆర్ అంబేద్కర్ గొప్పదనాన్ని కీర్తిస్తుంటే ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ రాజకీయ పార్టీ బీజేపీ మాత్రం ఆయన గొప్పదనాన్ని తక్కువ చేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. మరోవైపు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ఆయన కల్పించిన రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలకు బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. ఒక వైపు తాను ప్రధానమంత్రి అయ్యేందుకు అంబేద్కరే కారణం అని ప్రధాని మోడీ అంటుంటే, ఆయన మంత్రివర్గంలోని షా మాత్రం అంబేద్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యానించారని దుయ్యబట్టారు. తక్షణమే అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు మాయాదేవి, కరుణసాగర్, కరుణ రూప్లా, వనితా బ్గార్దే, రమేశ్, కొండా నాగేశ్వర్, యుగంధర్, మంచాల లింగస్వామి, వెంకటేశ్వర్లు, రామేశ్వర్, ప్రేమ్, అంసా నాయకులు నామ సైదులు, మంచాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యం పట్ల మహిళలు శ్రద్ధ పెట్టాలి

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 23: రోజంతా కుటుంబం కోసం పనిచేసే మహిళలు తమ శారీరక ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని ప్రముఖ గైనాకాలజిస్ట్ డాక్టర్ సరోజిని అన్నారు. న్యూ బోయిగూడలోని క్రితి సోషల్ ఇనిషియేటివ్ టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న మహిళల కోసం ఆమె సోమవారం అవగాహన శిబిరం నిర్వహించారు. రుతుక్రమ సమయంలో సరైన పరిశుభ్రత పాటించకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. నాణ్యమైన సానిటరీ ప్యాడ్స్ వాడాలని, పాత కాలపు పద్ధతులను వదిలేయాలని సూచించారు. ఇటీవల జరిగిన ఒక సర్వేలో దేశవ్యాప్తంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు ఎక్కువయ్యాయని తెలిసిందని, అందుకే తరచుగా వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. బస్తీల్లో మహిళలకు ఉచితంగా ఉపాధి శిక్షణ కోర్సులను నిర్వహిస్తూ, వారిని ఆర్థికంగా ఎదగడానికి పాటుపడుతున్న క్రితి సోషల్ ఇనిషియేటివ్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం

అడ్డగుట్ట, డిసెంబర్ 23: ప్రజా సమస్యల పరిష్కరానికి అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. సోమవారం మెట్టుగూడ చింతల్‌బస్తీలో కలుషిత నీటి సమస్య ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో వెంటనే కార్పొరేటర్ జలమండలి అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. కలుషిత నీటి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని ఆమె అన్నారు. సమస్య పరిష్కరానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

అన్నదానంలో కార్పొరేటర్

మెట్టుగూడ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానంలో కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఆమె అన్నం వడ్డించారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత

పారిశుధ్య సిబ్బందికి రగ్గుల పంపిణీ

పారిశుధ్య కార్మికులతో దేవాదాయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, కాలనీ ప్రతినిధులు

అమీర్‌పేట్, డిసెంబర్ 23: సనత్‌నగర్ జెక్‌కాలనీ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులకు కాలనీకి చెందిన తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రగ్గులను పంపిణీ చేశారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ నేతృత్వంలో కాలనీకి చెందిన హైమావతి, హరిత, భాగ్యలత, కృష్ణకుమారి, విజయలక్ష్మి, అమరావతి దాతలుగా పారిశుధ్య కార్మికులకు రగ్గులను పంపిణీ చేశారు. ప్రతి యేటా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా తమ కాలనీలో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బందికి వీటిని పంపిణీ చేశామని ఎస్.అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, రాజశేఖర చందులతో పాటు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పాలుపంచుకోవాలి

బేగంపేట్, డిసెంబర్ 23: సామాజిక సేవల్లో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ హుస్సేన్ అన్నారు. రాంగోపాలపేట్ డివిజన్ ఎంఐఎం నాయకులు అశోక్ ఆధ్వర్యంలో సోమవారం సికింద్రాబాద్ మథర్ తెరిస్సా విగ్రహం వద్ద ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న అనాథలకు, జీహెచ్ఎంసీ కార్మికులకు దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాధ్యమైనంత వరకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. తన సొంత నిధులతో సుమారు 200 దుప్పట్లు పంపిణీ చేసినట్టు స్థానిక నాయకులు అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు నందికంటి రవి, ఇమ్రాన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బలిజేపల్లి' రచనలు అద్వితీయం

ముషీరాబాద్, డిసెంబర్ 23: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా సోమవారం నాటక రచయిత, కవి బలిజేపల్లి లక్ష్మీకాంతం సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని బలిజేపల్లి లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బలిజేపల్లి రచనలు అద్వితీయమని కొనియాడారు. సత్య హరిశ్చంద్రీయ నాటకాన్ని రక్తికటించారని, పలు సినిమాల్లో సంభాషణలు, గొప్ప పాటలు రాసి తనకంటు ప్రత్యేకతను చాటుకున్నారని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొల్లి నాగేశ్వరరావు, బింగి నరేందర్‌గౌడ్, గాయని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి రచనలు ఆదర్శం

చిక్కడపల్లి: ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రచనలు నేటి సమాజానికి ఆదర్శమని రాష్ట్ర ఖనిజశాఖ మాజీ డైరెక్టర్, ప్రముఖ కవి డాక్టర్ వీడీ రాజగోపాల్ అన్నారు. భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ ఆధ్యక్షతన సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కళాభారతిలో భువనేశ్వరి హిందీ అనువాద గ్రంథం 'గురువోంక గురు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. కార్య

సభలో మాట్లాడుతున్న పొత్తూరి సుబ్బారావు

'పరిశోధక విద్యార్థుల సబ్మిషన్ గడువును పొడగించాలి'

ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23: ఓయూ పరిధిలోని పరిశోధక విద్యార్థుల సబ్మిషన్ గడువును పొడగించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్‌కు విద్యార్థి నేతలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2018లో పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులు కరోనాతో రెండేళ్ల కాలాన్ని కోల్పోయారన్నారు. దీంతో పరిశోధనలు నిలిచాయన్నారు. ఫెలోషిప్ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పరిశోధనలకు ఏడాది గడువు పొడగించడంతో పాటు ప్రోగ్రెస్ సెమినార్ 2, రీసర్చ్ డిజైన్ సెమినార్‌కు అనుమతించాలని, ప్రీ పీహెచ్‌డీ మరోసారి రాసేందుకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు కోరారు. 2016 బ్యాచ్ పీహెచ్‌డీ విద్యార్థులకు సైతం సబ్మిషన్ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, డీబీఎస్ఏ, టీఎస్‌పీజేఏసీ, ఆదివాసీ విద్యార్థి, తదితర సంఘాల నాయకులు కొమ్ము శేఖర్, జంగిలి దర్శన్, వలిగొండ నరసింహ, అరుణ్, క్రాంతి, ప్రణయ్‌కుమార్, కాంపాటి వె